

# సుభాషిణి

— అవధానుల విజయలక్ష్మి

"ఈమె సుభాషిణి" అన్నాడు విశ్వం ఫొటో అందిస్తూ.

అందుకొన్న రాజారావ్ వేళ్ళు ఫొటో మీద బిగుసుకున్నాయి.

ఫొటోపై పే చూస్తున్న అతని కళ్ళ లోకి మొదట ఆశ్చర్యం ఆ తర్వాత అసూయ ఆపైన బాధ ఒకదాని తర్వా తొకటి తోసుకొచ్చాయి.

రాజారావు పక్కనే నిలబడి ఫొటో లోకి చూస్తున్న విశ్వానికి మాత్రం రాజారావు మొహంలో మారే భావాలు కనపడలేదు.

చక్కని ఉంగరాల జుత్తూ కోటేరే సిన ముక్కు కింద గులాబీ మొగ్గల్లాంటి పెదవులూ అలా ఉంచినా... కొంతిపుంజా ల్లాంటి ఆ కళ్ళు చాలు మొహాన్నంతా డామినేట్ చేసేయడానికి!

'ప్రతి విషయంలోనూ నాకంటే అధి కుడై పోతున్నాడేమిటీ విశ్వం? ఆఖరికి కాబోయే భార్య విషయంలో కూడా!' కసిగా అనుకొన్నాడు రాజారావు. పెట్రోల్ లో నానినాని వున్న గడ్డికుప్ప మీదికి ఓ అగ్గిపుల్ల గీసి పడేసినట్లయింది ఆ ఫొటోలోని మొహం చూడగానే రాజా రావుకి. ఒకప్పుడీ విశ్వం ఎలా బతికే వాడో తనకి తెలుసు...

తను కార్లో రంయిన స్కూలుకి వెళు తుంటే, జారిపోయిన పాత లాగును

పైకి లాక్కొంటూ వెనకే కాళ్ళీడ్చు కుంటూ వచ్చేవాడు...

తను ఐస్‌క్రీం పార్లర్‌లో స్నేహి తులలో కలిసి ఖరీదయిన ఐస్‌క్రీం తింటుంటే, దూరంగా జంగిడిలోని పుణు కుల్ని కొనుక్కు తినేవాడు...

తను మెరిసిపోయే జెర్లిన్ బట్టల్లో తిరుగుతుంటే అతను వెలిసిపోయిన నూలుబట్టలు తప్ప మరోటి కట్టేవాడు కాదు...

అటువంటి విశ్వం...ఇప్పుడు...

తను ఎద్దులా కూర్చొని స్టేట్ మెంట్లు తయారు చేస్తుంటే – ఎయిర్ కండిషన్డ్ గదిలో కూర్చొని వాటిమీద సంతకాలు పారేస్తున్నాడు. తను ఒదిగొదిగి పైల్సు పుటప్ చేస్తుంటే, అతను దర్జాగా కూర్చొని, కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు రాస్తున్నాడు.

తన డొక్కు సైకిల్ని ఆఫీసు ముందు ఆపే సమయానికి అతను మారుతీకారు మెత్తని సీట్లోంచి దిగుతు న్నాడు!

ఎంతలో ఎంత తేడా?

రెండు కాలాల మధ్య మారిన పరిస్థి తుల గురించి మాత్రమే ఆలోచించే రాజారావే ఆ పరిస్థితులకి కారణమయిన విషయాల గురించి మాత్రం ఎప్పుడూ ఆలోచించలేదు.

తను స్నేహితులతో రాత్రల్లా పేకా డుతూ కూర్చున్నప్పుడు అతను పుస్తకా లతో కుస్తీపట్టేవాడనీ...

తను తండ్రిచ్చిన పాకెట్ మనీని బీర్‌లకీ విస్కీలకీ విచ్చలవిడిగా ఖర్చు పెట్టే సైములో అతను పార్ట్‌టైం జాబ్ చేస్తూ పైసాపైసా కూడబెట్టి పుస్తకాలు కొనేవాడనీ....

తన తండ్రి ఆరోగ్యం పాడయి ఇక వ్యాపారం చూసుకోలేక అది దివాలా తీసే సమయానికి తనని చూసుకోమంటే "వెధవ వ్యాపారం ఎవడు చూస్తాడు? ఐ వాంటూ ఎంజాయ్ ది లైఫ్" అని తను అంటున్న సమయంలో అతను వీలైనన్ని క్వాలిఫికేషన్లు సంపాదించే ప్రయత్నంలో ఉన్నాడనీ...

అన్నీ మర్చిపోయాడు రాజారావ్.

కాపీ ఫొటోలోని సుభాషిణి అందం మాత్రం సూదిలా గుచ్చుకొంటూ జీవి తాంతం బాధపెడుతూనే ఉంటుందని అతను మరిచిపోలేదు.


మనస్సులో భగ్గుమంటున్న మంటలు చల్లార్చుకోక తప్పదు!

ఓ విషయం చప్పున గుర్తొచ్చింది రాజారావ్‌కి.

ఈ విశ్వం ఏడాది క్రితమే హైద్రా బాదొచ్చాడు. తన కాబోయే భార్య చిన్న పట్నించీ ఇక్కడే ఉండేదని చెప్పా డొకసారి.

మనసులోని విషబిందువుకో చిన్న రూపం ఏర్పడింది.

"డబుల్ కంగ్రాట్స్" అన్నాడు రాజారావ్ ఫొటోని తిరిగి ఇచ్చేస్తూ.




"డబుల్ ఎందుకూ? నేనేం ఆదర్శ వివాహం చేసుకోడం లేదు. ఒద్దన్నా మా మామగారు కట్నమిస్తున్నారు. ఇంట్లో పరిస్థితులు బాగోలేక పుచ్చుకుంటున్నానే కానీ ఆరో లోన్ కింద భావించి త్వరలోనే తీర్చేస్తా" అన్నాడు విశ్వం కాస్తంత సిగ్గుపడుతూ.

రాజారావు మనసులోని విషబిందువు మరికాస్త పెద్దదయింది.

"భలేవాడివే! ఆదర్శవివాహం కాదంటావేం? అన్నీ తెలిసీ ఆ అమ్మాయిని చేసుకొంటున్నావంటే అది ఆదర్శ వివాహం కాదూ?" అతికించుకొన్న చిరునవ్వుతో అన్నాడు రాజారావ్.

"అన్నీ తెలిసా? అంటే?" కనుబొమలు ముడివేసి అడిగాడు విశ్వం.

"సారీ... నీకేం తెలియదన్నమాట! తెలుసుననుకొని అలా అన్నాను."

"ఏమిటి నువ్వనేది?" అసహనంగా అడిగాడు విశ్వం.

"అంతలా ఆవేశపడకోయ్! చాలా చిన్న విషయం... అఫ్‌కోర్స్... టీనేజిలో అమ్మాయిలకీ, అబ్బాయిలకీ ఆ మాత్రం ఎక్స్‌పీరియన్సెస్ ఉండకపోవు!... ఏదో అనేశాను! దాని గురించి అట్టే ఆలోచించకు" చాలా కాజువల్‌గా అన్నట్లు అన్నాడు రాజారావ్.

"సరే ఐతే వెళ్తున్నా" విసిరిత్తంగా అని ఫొటో చేత్తో పట్టుకొని తన చేంబర్ వైపు కదలబోయాడు విశ్వం.

కంగారుపడ్డాడు రాజారావ్.

అమ్మో ఇప్పుడో మాట చెప్పకపోతే మరెప్పుడూ చెప్పడమవదు!

"అదేమిటి విశ్వం అలా కోపం తెచ్చుకొంటావేం? నేను చెప్పేదేమంటే ఆ అమ్మాయికి అప్పుడెప్పుడో... కొన్నేళ్ళ కిందటి సంగతిలే... ఎవరో అబ్బాయితో బాగా స్నేహముండేదట. ఇద్దరూ కలిసి బాగా తిరిగేవారట"

"ట...ట... అంటున్నావ్. అందరూ

అనుకోవడమేగా? పోన్లే" నిర్లక్ష్యంగా అన్నాడు విశ్వం.

"అందరూ అనుకోడమే కాదోయ్! నేను కూడా ఓసారి స్వయంగా చూశాను!"

"నిజం?"

"అవును ... నాలుగైదేళ్ళ క్రితం కాబోలు ఓసారి పబ్లిక్ గార్డెన్స్‌కి వెళ్తే అక్కడ ఈ అమ్మాయి ఎవరో అబ్బాయితో కనిపించింది. అప్పట్లో మా ఇల్లు వాళ్ళింటికి దగ్గర్లోనే ఉండేదిలే! అందువల్ల ముఖపరిచయం ఉండేది. నాకేం తెలుసూ నీ కాబోయే భార్య పేరు సుభాషిణి అని చెప్పినప్పుడు ఆ సుభాషిణీ ఈ సుభాషిణీ ఒకరేనని! నేనెవరో ఆ అమ్మాయికి తెలియదుగా...ఆ అబ్బాయితో బోల్డు కబుర్లు చెప్పింది. పెళ్ళి చేసుకుందామనీ పెద్దవాళ్ళొప్పుకోకపోతే ఎక్కడైనా వెళ్ళిపోదామని - ఏమిటేమిటో మాట్లాడింది" విశ్వం మొహాన్ని పట్టిపట్టి చూస్తూ ఒక్కమాట అన్నాడు రాజారావ్.

ఎంత పట్టిపట్టి చూసినా ఆ మొహం లోని భావాలు అంతుపట్టలేదతనికి. ఎంతసేపటి తర్వాతో విశ్వం అడిగాడు

"నువ్వు విన్నావా ఆ మాటలు?"

"నా చెవుల్తో స్వయంగా! అయినా ఆ విషయం గురించి అట్టే వర్రీ అవకు బ్రదర్. ఎప్పుడో జరిగిపోయిన సంగతి కదా. పైగా టీనేజిలోని పిల్లల మాటలకి ఓ అర్థంపర్థం ఉంటుందా కనకనా? అప్పుడే నాలుగైదేళ్ళు అయిపోయిందిగా ఆ అబ్బాయిని మరిచిపోయే ఉంటుందిలే. ఎనీ హౌ....బెస్ట్ ఆఫ్ లక్." విశ్వానికి షేక్‌హాండిచ్చి తనసీటువైపు కదిలాడు రాజారావ్.

చాలా సంతృప్తిగా వుందతనికి!

ఏం చేస్తాడిప్పుడు విశ్వం?

అన్నీ కుదిరిన పెళ్ళిని ఆపేస్తాడా?

అంత అందమైన అమ్మాయిని ఒదిలేసుకుంటాడా?

ఏది చేసినా ఓ జీవితాంతం అతను కుళ్ళి కుళ్ళి చావక తప్పదు.

పెళ్ళి చేసుకొంటే ఆ అబ్బాయిని గురించిన అనుమానం...పెళ్ళి చేసుకోకపోతే అందమైన అమ్మాయిని పోగొట్టుకొన్నానన్న బాధ...ఓ జీవితాంతం దొలుస్తూనే ఉంటాయి. చచ్చిపోయేదాకా ఆ కంట్లోని నలుసుతో అలా బాధపడక తప్పదు.

బహుశ పెళ్ళి ఆగిపోవడమే జరగొచ్చు!

కానీ అతని అంచనాలకి విరుద్ధంగా ఫెళ్ళున పెళ్ళి జరిగిపోయింది. పైగా రిసెప్షను కెళ్ళిన రాజారావుకి విశ్వం కంట్లో తనూహించుకొన్న 'నలుసు' కనపడనూ లేదు!

కానీ మర్నాడు అతను ఆఫీసుకొచ్చే సరికి మాత్రం రెండుత్తరాలు అతని కోసం ఎదురుచూస్తున్నాయి.

ఒకటి ఆఫీసు ద్వారా వచ్చింది. మరోటి పెర్సనల్ లెటర్.

ముందుగా పెర్సనల్ లెటర్ విప్పాడు.

"డియర్ రాజారావ్,

పాపం నిన్ను చూస్తుంటే జాలి పడాలో, దుఃఖపడాలో తెలియడం లేదు.

నా కాబోయే భార్య గురించి ఎంతో శ్రద్ధగా హెచ్చరించబోయావ్. థాంక్స్. ఒక్కటి మాత్రం నిజంలే.

నువ్వు చెప్పిన విషయం నిజమైనా అబద్ధమయినా నేను విచారించను. ఎందుకంటే పదహారేళ్ళ వచ్చి వయస్సులోని అమాయకపు ఆవేశాలు ఎలాగుంటాయో నాకు తెలుసు కాబట్టి... నేనూ ఆ స్టేజిని దాటివచ్చిన వాడినే కాబట్టి.

ఇకపోతే నిన్ను దూరంగా ఉన్న అడవి ప్రాంతాలకి ట్రాన్స్‌ఫర్ చెయ్యడానికి కారణమంటావా?

నువ్వు మరికొన్నాళ్ళు ఇదే ఆఫీసులో నాదగ్గరే వుంటే లోకంలోని మనుషులందరూ నీలాంటివాళ్ళేనేమో అన్న అభిప్రాయంతో నేనో సినిక్‌గా మారిపోయే ప్రమాదముంది. నేనే కాదు. ఆఫీసులోని మిగతా వందమంది కూడా.

దూరంగా ఉన్న ఆ అడవిప్రాంతంలోనైతే ఎక్కువ మంది మనుషులుండరు. సరే అసలు విషయం నీకు చెప్పలేదుగా.

నా సుభాషిణి... ఎవరిమాటలనైతే నాలుగైదేళ్ళ క్రితం పబ్లిక్ గార్డెన్స్‌లో నువ్వు స్వయంగా విన్నావో... తను పుట్టు మూగది.

అంతేకాదు చిన్నప్పటి నుంచి నాకు తెలిసిన మా మావయ్య కూతురే. కొన్నాళ్ళ క్రితం నీ మాటలు విన్నాక తన మూగతనం నాకు మరింత అందంగా కనపడి సంతోషం ఇంకా ఎక్కువౌతోంది.

ఉంటా.

నీ విశ్వం"

రెండో ఉత్తరం విప్పే ధైర్యం లేక అలా కూర్చుండిపోయాడు రాజారావ్.